
చెరువును తలపిస్తున్న మాగుంట లేఅవుట్లోని అండర్ బ్రిడ్జి


ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద..


సండే మార్కెట్ సమీపంలో..


బాలాజీనగర్‌లో ఇంట్లోకి చేరిన నీరు

జడివాన

తుపాన్ ప్రభావంతో నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షానికి నగరంలోని రోడ్లు జలమయమయ్యాయి. అండర్ బ్రిడ్జిలు నీటమునగడంతో వాహనచోదకులు ఇక్కట్లు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


వనంతోపు సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్


కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

క్లుప్తంగా

తెగిన విద్యుత్ తీగలు.. సకాలంలో మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

కోవూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా 33/11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో మండలంలోని పలు ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోవూరు ట్రాన్స్‌కో డీఈ సతీష్, ఏఈలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన వర్షంలోనే మరమ్మతుల చర్యలు చేపట్టారు. మొత్తంగా మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

పొదలకూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దోమలు, అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవడం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం చేయాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని పంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకుని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం అధికారులు కిందిస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకోవాల్సిందిగా సూచించారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

• జేసీ కూర్మనాథ్


ఇందుకూరుపేట : రాముడుపాళెంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

ఇందుకూరుపేట : మిచాంగ్ తుపాన్ తీవ్రత అధికంగా ఉండనుందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జేసీ కూర్మనాథ్ అన్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన మైపాడు, గంగపట్నం, రాముడుపాళెంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి నష్టాలు వాటిల్లకుండా ముందస్తు చర్యలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అవసరమైన ఆహారం, తాగునీరు, ముందులు అందుబాటులో ఉంచుకోవాలని జేసీ కోరారు.

ఆడుదాం ఆంధ్రాకు రిజిస్టర్ చేసుకోండి



సోమశిల: గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రాకు రిజిస్టర్ చేసుకోవాలని ఎంఈఓ కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కామిరెడ్డిపాడు, బొమ్మవరం సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రాకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న గ్రామ వలంటీర్ల పని తీరును ఆయన పరిశీలించారు. అనంతరం మినగల్లు, రేవూరు, ఇస్కపల్లి పోలింగ్ కేంద్రాలన పరిశీలించి ఓటరు జాబితా ప్రక్రియ వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రిసోర్స్ పర్సన్ సురేష్‌కుమార్, సీఆర్‌పీ మాధవ్ తదితరులు ఉన్నారు.

వాహనచోదకులు జాగ్రత్త వహించండి

ఆత్మకూరు: తీవ్రమైన తుపాన్ వర్షాల నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో జాగ్రత్త వహించాలని ఎంవీఐ ఎం.రాములు సూచించారు. ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు ఇద్దరు కంటే ఎక్కువ ప్రయాణించరాదని, ప్రయాణాలు తగ్గించుకోవాలని సూచించారు. గొడుగు వేసుకుని వాహనాలపై ప్రయాణిస్తే ఎదురుగాలికి ప్రమాదాలు జరిగే పరిస్థితి సంభవిస్తుందని హెచ్చరించారు.

ఎడతెరపిలేని వర్షం


చెరువును తలపిస్తున్న తల్పగిరి కాలనీ

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా వర్షం ఆదివారం కురిసింది. ఫలితంగా నగర శివారులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గృహాల మధ్య నీరు చేరి చెరువులను తలపించాయి. 25వ డివిజన్లోని తల్పగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, 30వ డివిజన్లోని రెవెన్యూ కాలనీ, చంద్రబాబునగర్, తిరుమలనగర్, శ్రామికనగర్, వైఎస్సార్‌నగర్, మల్లయ్యగుంట చవటమిట్ట టైలర్స్‌కాలనీ నీట మునిగాయి. రోడ్లు రొచ్చురొచ్చుగా మారడంతో రాకపోకలు సాగించేవారు నానా పాట్లు పడ్డారు. వరదనీరు చెరువుల్లోకి చేరుతోంది. వరద నీరు ప్రవహించడంతో శ్రామికనగర్ నుంచి అయ్యప్పగుడికి వెళ్లే ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): తుపాన్‌ను ఎదుర్కొనేందుకు నగరపాలక సంస్థ యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉందని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గాంధీ గిరిజన కాలనీ, మాగుంట లేఅవుట్, బీవీనగర్, మినీబైపాస్ రోడ్డు, జీఎన్టీ రోడ్డు, వేదాయపాళెం, కొండాయపాళెం, రామ్మూర్తినగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆదివారం పర్యటించిన ఆయన మాట్లాడారు. గాంధీ గిరిజన కాలనీ, సీఆర్పీ డొంక తదితర ప్రాంతాల్లో వర్షపు నీటితో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆహారంతో పాటు ఇతర సదుపాయాలను కల్పించాలని సూచించారు. అవసరమైన చోట బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అడ్డంకులను జేసీబీల సాయంతో తొలగించాలన్నారు. మాగుంట లేఅవుట్, ముత్తుకూరు అండర్ బ్రిడ్జిల్లోకి చేరిన వర్షపు నీటిని మోటార్ల సాయంతో సాధ్యమైనంత త్వరగా తోడేయాలని సూచించారు. రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని చెప్పారు.


అధికారులకు సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

ఎగసిపడుతున్న కెరటాలు


ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు

ఇందుకూరుపేట : మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో మండల పరిధిలోని తీరప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున్న ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. కాగా ఎడతెరిపి లేని వర్షం కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. నిడిముసలి–ముదివర్తిపాళెం రోడ్డుపై నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రతికూల వాతావరణం ఉండడంతో మైపాడు బీచ్‌కు ఎవరూ రావద్దని కోవూరు సీఐ డి.వెంకటేశ్వరావు కోరారు.

చిగురిస్తున్న ఆశలు

పొదలకూరు : మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. తుపాను ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే నార్లు పోసుకునేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. కొన్ని గ్రామాల్లో నార్లు పోసుకుని ఉండగా, మరికొన్ని గ్రామాల్లో విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరుపూరు గ్రామంలో నాయుడు చెరువు, పెద్దచెరువు, చిన్నచెరువులు ఉన్నాయి. ఈ మూడు చెరువుల్లోకి రెండు మాసాలకు సరిపడా నీరు చేరినట్లు రైతులు వెల్లడించారు. మండలంలో శనివారం 48 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. చెరువులకు నీటి లభ్యతపై వ్యవసాయ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఏఓ ఎ.వాసు మాట్లాడుతూ రైతులు నార్లు పోసుకుని సమయం వృథా చేసుకునే కంటే ఆధునిక వ్యవసాయ పద్ధతిలో నేరుగా వరి విత్తనాలను చల్లుకోవాల్సిందిగా సూచించారు. డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు విత్తేతే సమయం కలిసివస్తుందని తెలిపారు. రైతులు యంత్రాల ద్వారా నాట్లు వేసుకుంటే సమయం వృథా కాదని సూచించారు. తాటిపర్తి గ్రామంలో ఇటీవల వరిసాగులో భాగంగా నార్లు పోసుకోకుండా నేరుగా విత్తనాలు చల్లుకునే పద్ధతికి అలవాటు పడుతున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావం చూసుకుని రైతులు నార్లు పోసుకోవాల్సిందిగా తెలియజేశారు.


పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

13 పునరావాస కేంద్రాలు

నెల్లూరు(బారకాసు): లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం కార్పొరేషన్ పరిధిలో 13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దొరతోపులోని ఎంపీపీ స్కూల్, వైకుంఠపురంలోని ఎమ్సీపీఎస్ కేంద్రం, స్టోన్‌హౌస్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, చిన్నబాలయ్యనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, బాజీతోటలోని ఎంసీపీ స్కూల్, గోమతినగర్‌లోని గోమతి నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కొత్తూరులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్, దర్గామిట్టలోని డీకేడబ్ల్యూ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. కర్నాలమిట్టలోని కార్పొరేషన్ హైస్కూల్, సంతపేటలోని బీఈడీ కళాశాల, పాత మున్సిపల్ కార్యాలయం, గుంటబడి, వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, రంగనాయకుల పేటలోని పీఎమ్మార్ హైస్కూల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఆయా కేంద్రాల పర్యవేక్షణకు నగరపాలక సంస్థలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వలంటీర్లను నియమించామన్నారు. వీరంతా నిరంతరం అందుబాటులో ఉంటారని, అవసరమైతే 1800 – 425 – 1113, 0861 – 2301541 కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు.

12న మహామృత్యుంజయ హోమం

నెల్లూరు(బృందావనం): కార్తీక అమావాస్యను పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో మహా మృత్యుంజయ పాశుపత హోమాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాలింగార్చనను డిసెంబర్ పదిన నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వివరాలకు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. కిసాన్‌నగర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిపోయారు. విషయాన్ని గమనించిన స్థానికుడు అబ్దుల్ రెహమాన్ 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే సదరు వ్యక్తి మృతి చెందారు. నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96310 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

కాంగ్రెస్ నేతల హర్షం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు సంబరాలు జరుపుకొన్నారు. ఇందిరాభవన్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. నేతలు శ్రీనివాసులురెడ్డి, ఫయాజ్, గణేష్‌బాబు, మైనుద్దీన్, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

పరమశివా.. ప్రణామం



నెల్లూరు(బృందావనం): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు పరమశివుడికి కళారూపమిచ్చారు. ఆరంగుళాల ఎత్తు, నాలుగంగుళాల వెడల్పుతో 124 ఇనుప నట్లు.. 45 టమోటాలతో 12 అంగుళాల ఎత్తు, 8 అంగుళాల వెడల్పుతో శివలింగాలను తీర్చిదిద్దారు.

అగ్నిమాపక శాఖ అప్రమత్తం



నెల్లూరు(క్రైమ్): మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా అగ్నిమాపక శాఖ సిద్ధమైంది. సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు అగ్నిమాపక పరికరాలు, బోట్లను సిద్ధం చేసి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతి స్టేషన్లో రెస్క్యూ ఎక్విప్‌మెంట్, బోట్లు తదితరాలను సిద్ధంగా ఉంచుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి సూచించారు. మరోవైపు సిబ్బందికి సెలవులను రద్దు చేశారు. సెలవుల్లో ఉన్న వారు సైతం వెంటనే కార్యాలయాలకు చేరుకొని అందుబాటులో ఉండాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈదురుగాలులకు స్తంభాలు, చెట్లు పడిపోతే వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, తుపాన్ తీరం దాటేంత వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే కంట్రోల్ రూమ్ 101, 99637 34284, 99499 91066, 0861 – 2331051 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

పునరావాస కేంద్రంలో పరిశీలన

నెల్లూరు (దర్గామిట్ట): వెంకటేశ్వరపురంలోని గాంధీ గిరిజన కాలనీలో కచ్చా ఇళ్లు, గుడిసెల్లో నివసిస్తున్న వారి కోసం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ హరినారాయణన్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఇక్కడ ఉన్న వారికి రెండు పూటలా నాణ్యమైన భోజనం, ఉదయం అల్పాహారం, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడ్ని ఆదేశించారు.


మాట్లాడుతున్న హరినారాయణన్

ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భారీ వర్షాలతో డివిజన్లోని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు చేపడుతున్నామని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. తుపాన్ నేపథ్యంలో డివిజన్లోని ఏసీనగర్ గిరిజన సంఘం, వేపదొరువు, క్వార్టర్స్ లైన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితి.. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలను నగరపాలక సంస్థ ఈఈ సంజీవ్‌కు ఫోన్లో వివరించారు.


సమస్యలను ఆరాతీస్తున్న ప్రతాప్‌రెడ్డి

పాటలు, నృత్య పోటీలు నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాటలు, నృత్య పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయనున్నామని చెప్పారు. సంగీత విభావరిని సుస్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నిర్వాహకులు రాధాకృష్ణ, చాంద్ బాషా, గౌస్‌బాషా, సికిందర్ పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బీజేపీ కార్యాలయంలో సంబరాలు

నెల్లూరు(మినీబైపాస్): ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో నగరంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద నేతలు సంబరాలను ఆదివారం జరుపుకొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయ, రాజేష్, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాల పరిశీలన

కోవూరు : మండలంలోని పది గ్రామాల్లో 2,700 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. ఎక్కువ భాగం బీపీటీ 5204, ఆర్‌ఎస్‌ఆర్ 15048 తదితర రకాలు నారుమడుల దశలో ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు నాట్లు వేసిన పొలాలు, నారుమడులు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగి ఉన్నాయి. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు ఆదివారం నీట మునిగిన నారుమడులు, వరినాట్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్‌ను కలిపి చల్లుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు నారాయణ, రైతులు పాల్గొన్నారు.


మునిగిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు